# 3. హరికుమార్

బి.యల్ డిగ్రీ పరీక్షలో యూనివర్శిటిలో ప్రథమస్థానం పొందిన సమర్థుడు హరికుమార్. అతను, నల్గొండజిల్లాలో ఒక మామూలు వ్యవసాయదారుడైన నాగభూషణ రావుగారి ఏకైక సంతానం. పాతరోజుల్లో జిల్లాలోని ఒక కుగ్రామంలో ఒకేస్కూలులో, ఒకే క్లాసులో, నాగభూషణం, తాండవ కృష్ణకలిసి చదువుకున్నారు. నాగభూషణం ఎనిమిదో క్లాసు వరకు చదివి, తన కుటుంబవృత్తి ఐన వ్యవసాయాన్ని స్వీకరించాడు. కానీ, తాండవకృష్ణ మెట్రిక్యులేషన్ వరకూ ఆ గ్రామంలోనే చదువుకుని, పై చదువుల కోసం హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఐనా కూడా, ఆ ఇద్దరు మిత్రుల మధ్యన సౌహృదబంధం బలహీనం కాలేదు. ఒక వకీలుగా తాండవకృష్ణ పేరు ప్రఖ్యాతులతో పాటు బాగా డబ్బు కూడా సంపాదించడం గమనించిన నాగభూషణరావు తన కొడుకుని 'లా' చదవడానికి పంపించడం జరిగింది. ప్రశంసాయోగ్యమైన రీతిలో నియమపరీక్ష పాసయ్యేటపుడు ఆ అబ్బాయి జూనియర్ తాండవకృష్ణగా రూపొందాలని తండ్రి ఆశించాడు.

తాండవకృష్ణ దగ్గర హరికుమార్ జూనియర్‌గా చేరడానికి అదే ఒక కారణం. క్రిమినల్ వకీళ్ళ మధ్యన సర్వోత్కృష్టుడిగా విరాజిల్లుతున్న ఒక గొప్ప వ్యక్తి క్రింద జూనియర్‌గా పనిచేయడం హరికుమార్‌కి ఎంతో సంతోషంగా, ఎంతో గర్వంగా అనిపించింది.

కానీ తాండవకృష్ణుడి అసలు రంగు తెలియడానికి అతనికి ఎక్కువ కాలం పట్టలేదు. ముందు ముందు అతని అధర్మమని అనిపించే కొన్ని కార్యక్రమాలు చూసేటప్పుడు, అవి ఒక అభిభాషకుడి విజయగాథకి అవిభాజ్యమైన ఘటకంగా అతనికి తోచింది. కానీ, ఒకటిన్నర సంవత్సరం అతనికి దగ్గరగా పనిచేసినపుడు, అతను మానవుడు కాడని, డబ్బుకోసం ఏ పని చేయడానికైనా వెనుకడుగు

వేయడని అతనికి అర్థమయింది. ఎవరైనా ఒక అపరాధి వకీలు దగ్గరకు వస్తే అతనికి అపరాధ విమోచనం కలిగించడం వృత్తి ధర్మమే అని అనుకోవచ్చు. అపరాధికి శిక్ష తప్పించడం అధర్మమే ఐనా ఏ ప్రతివాది కూడా ప్రాసిక్యూషన్‌తో సహకరించాలని ఎవ్వరూ అభిప్రాయపడరు. కానీ, మన తాండవకృష్ణ సామర్థ్యం, అపరాధులను శిక్షావిముక్తులను చేయడంలో ఒక మెట్టుపైనే ఉండేది. ఎవరైనా ఒకడు హత్య చేయాలని పథకం వేస్తే అతను తాండవకృష్ణ దగ్గరకు వస్తే చాలు. ఆ పథకం సురక్షితమైన రీతిలో నిర్వహించడం ఎలా? అని ఆ నియమ రాక్షసుడు మంచి సలహా ఇస్తాడు. న్యాయస్థానాలలో జరిగే కేసులలో ప్రాసిక్యూషన్ సాక్షులనే కాక ప్రాసిక్యూటర్‌ని కూడా ఎలా కొనుక్కోవాలో అతను ఉపాయాలు చెప్తాడు. ఒక అపరాధిని ఉరిశిక్షనుంచి తప్పించడానికి వీలులేని విధంగా సాక్ష్యంచేప్పే వ్యక్తి ఎవరైనా ఉంటే, అతనిని కొనుక్కోవడానికి గానీ, స్వాధీనపరచుకోవడానికి గానీ బెదిరించడానికి గానీ సాధ్యం కాకపోతే, అతనికి ప్రమాదవశాత్తు స్వర్గారోహణ ప్రాప్తిని కలిగించడానికి సంకోచించేవాడు కాదు తాండవకృష్ణ. వీలుంటే, తన పక్షం సాక్షులని కూడా బెదిరించి డబ్బు గుంజడంలో అతనికి ఏ మాత్రం సిగ్గుండేది కాదు. ఒక అపరాధికి చూడటానికి పరవాలేదనిపించే ఒక భార్యగాని, సహోదరి గానీ, పుత్రిక గానీ ఉంటే, ఆ కేసు జరుగుతున్నంత కాలం, ఆ స్త్రీ లేదా ఆ అమ్మాయి తాండవకృష్ణ చేతిలో ఆటబొమ్మగా ఉండవలసిందే.

తాగుడు విషయంలో అతనికి కొన్ని పట్టింపులున్నాయి, మంచి స్కాచ్ విస్కీ మాత్రమే అతను తాగుతాడు. మంచి మిత్రుల మధ్యన ఉండేటప్పుడు, కొంచెం ఎక్కువ సరదాగా ఉండేటప్పుడు అతని పానాసక్తి కూడా పెరిగేది. మిత్రుల మధ్యన మిత్రురాళ్ళు ఉండకూడదని లేదు. అలాంటి మిత్రురాళ్ళు ఉంటే ఆయనకి మత్తు మత్తుగా అనిపించేది. ఒక స్త్రీని చూసి అభినివేశం కలిగితే ఆమె ఎవరి భార్య అని, ఎవరి సహోదరి అని అతడు ఆలోచించేవాడు కాదు. తనకు నచ్చినది ఏదైనా సరే, తనదే కావాలనే పట్టుదల అతనికి ఉండేది. అది స్వాధీనపరచుకోవడానికి కావాల్సిన శక్తి సామర్థ్యాలు అతనికి ఉన్నాయి. అతనిపై

పోలీసులకు కంప్లైంటు చేయడానికిగానీ, రౌడీలతో కొట్టించడానికి గానీ, స్వయంగా ఎదురుపడి బెదిరించడానికి గానీ ఎవరికీ ధైర్యముండేది కాదు. ఎంతోమంది ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అతనికి, మిత్రులుగా, ఆరాధకులుగా ఉండటం వలన అతను కిరీటం లేని రాజుగా సర్వప్రతాపైశ్వర్యాలతో సుఖంగా బతుకుతున్నాడు.

అనూరాధ 'లా' కాలేజీలో చేరినపుడు, హరికుమార్ మూడో సంవత్సరం విద్యార్థి. కాలేజీ జీవితంలోని ఉత్తమమైన రంగాలన్నిటిలో తన వ్యక్తిత్వం ముద్రిస్తూ వచ్చిన హరికుమార్ అంటే ఆ కాలేజీలోని అమ్మాయిలందరికీ ఒక ఆరాధనాభావం ఉండేది. మొదటి సంవత్సరం దాదాపు పూర్తయ్యేసరికి, ఆ ఆరాధక బృందానికి అనూరాధ అగ్రగణ్య అయ్యింది. కాలేజీలో జరిగే చర్చాగోష్ఠులలో ప్రసంగ పోటీలలో హరికుమార్‌కే ప్రథమస్థానం లభించడంలో ఎవరికీ ఆశ్చర్యం కలిగేది కాదు. కానీ, మొదటి సంవత్సరంలో చదువుతున్న ఒక అమ్మాయికి వాటిల్లో ద్వితీయస్థానం లభిస్తే అదే తరగతిలో చదువుతున్న ఇతర విద్యార్థినీ విద్యార్థులకు అమితమైన అభిమానం, కొందరు అమ్మాయిలకు అమితమయిన అసూయ కలగడంలో ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఏమైనా సరే ప్రథమస్థానంలో ఉన్న హరికుమార్, ద్వితీయస్థానంలో ఉన్న అనూరాధ మధ్య ఆదర్శనీయమైన అనుబంధం ఏర్పడటం జరిగితే అది వారి పూర్ణసమ్మతితో కాదు. వాళ్ళ మధ్య ఆ విధంగా ఏర్పడిన అన్యోన్యఆదరణ పెరుగుతూనే వచ్చింది.

బి.యల్. పాసయిన తర్వాత హరికుమార్, తాండవకృష్ణ దగ్గర ప్రాక్టీసు మొదలుపెట్టడంలో అందరికంటే ఎక్కువగా సంతోషించింది అనురాధే. ప్రతిరోజూ ఉదయం హరికుమార్ ఇంటికి రాగానే, అనూరాధ తనకున్న సందేహాలను అతనితో చర్చించటం ఒక దినచర్యలాంటిది అయింది. కాలేజీలోని ఏ ఒక అధ్యాపకుడి కంటే ఇంకా బాగా అర్థమయ్యేటట్లు వివరంగా చెప్పే సామర్థ్యం

అతనికి ఉంది. ఇలా కొంతకాలం గడిచేటప్పటికి వారు తీవ్రానురాగబద్ధులైనారు. వారి మధ్య దగ్గరి సంబాంధాలేర్పడటానికి తాండవకృష్ణకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే, హరికుమార్ అన్ని విధాలుగా తన కూతురుకు అనురూపుడైన ఒక జీవితభాగస్వామిగా ఉండగలడని అతని నమ్మకం.

కానీ, మనుష్యుల అభిప్రాయాలకు వ్యత్యాసం రావడానికి ఎక్కువ కారణాలక్కర్లేదు కదా! సాధారణంగా, ఈ కారణాలకు ఎక్కువ మంది, సాహచర్యాలు లేక పరిస్థితుల ప్రభావాలు అని పేరు పెడతారు. ఎంతో సంకోచిస్తూ తాండవకృష్ణ నిజస్వరూపం ఏమిటో అనూరాధకు మెల్లమెల్లగా తెలియచెప్పటానికి హరికుమార్ ప్రయత్నం చేశాడు. ఆ సంభాషణ మొదలుపెట్టగానే అనూరాధ ముఖం ఎరుపెక్కింది. "హరీ! దైవసమానుడైన నా తండ్రిని అపార్థం చేసుకోకూడదు. అతి సమర్థుడైన లాయరు అవడం వల్ల ఆయనగురించి ఎంతోమంది ఎన్నెన్నో కట్టుకథలు సృష్టిస్తారు. మీరు అవేవీ నమ్మకూడదు. నా తల్లి మరణించి ఎన్ని సంవత్సరాలయిందో మీకు తెలుసా? ఈయన స్థానంలో వేరెవరైనా ఉంటే, ఆయన ఎప్పుడో మరో పెళ్ళి చేసుకుని, సుఖంగా బతికేవారు. కానీ, ఈయన ఎంత పెద్ద త్యాగమూర్తి అని మీకు తెలియదు. ఆయన బతికేదే నా కోసం, నా అన్న కొరకు. మద్యపానం, సిగరెట్టు, ఇత్యాది అలవాట్లన్నీ ఆయనకు పాతకాలం నుంచీ ఉన్నాయి. ఆయనకు గర్వం కొంచెం ఎక్కువ అన్న మాట మాత్రం నిజమే. ఆయన మాట్లాడేతీరు చాలా మందికి నచ్చదేమో. అందుకే కొంతమంది, ఆయనని రకరకాలుగా చిత్రీకరిస్తారు. ఏదేమయినా, నా తండ్రి అంటే నాకు చాలా అభిమానం. ఆయన మంచివాడా, చెడ్డవాడా అని నేను ఎప్పుడూ ఆలోచించలేదు. అలా ఆలోచించే అవసరం కూడా నాకు లేదు. ఎలాంటి మనిషైనా ఆయన నా తండ్రే ఎవరైనా ఆయనని నా ముందు విమర్శిస్తే విని తట్టుకోవడం నా వల్ల కాదు.

దానికి ఏ జవాబివ్వాలో హరికి అర్థం కాలేదు.

"అనూ! మీ తండ్రిగారిని విమర్శించాలని నా కెలాంటి ఉద్దేశం లేదు. ఇంత కాలం పరిచయం తర్వాత కూడా మీరు నన్ను సరిగా అర్థం చేసుకోలేదా? తల్లి దండ్రులను విమర్శించడు, ఏ సంతానానికీ నచ్చదని నాకు బాగా తెలుసు. ఐనా ఈ విషయం నేనెందుకు ప్రస్తావించానంటే కొన్ని నిజాలు మీరు కూడా తెలుసుకోవడం చాలా అవసరం. తెలుసుకోవడంలో తప్పులేదు కదా! నేను ఇంకా ఎక్కువకాలం, వారి జూనియర్‌గా పనిచేయాలని అనుకోవడం లేదు. వారి స్వభావంతో కలిసిపోవడం నాకు సాధ్యం కావడం లేదు. నేను విడిపోవడానికి గల కారణాలు మీకు చెప్పకుండా ఎలా ఉండగలను. నన్ను మీరు అపార్థం చేసుకోకుంటే, కొన్ని సంఘటనలకు మిమ్మల్ని సాక్షిగా నిలబెడ్తాను. మీరు స్వయంగా మీ కళ్ళతో చూసి, మీ చెవులతో వినండి."

చాలా సావకాశంగా హరి, అనూరాధ కళ్ళను ఆవరించి ఉన్న కట్టుతెరలు తొలగించాడు. దైవసమానుడని భావించిన తన తండ్రి పిశాచం కంటే నికృష్టకృత్యాలు ఎలా చేయగలుగుతున్నాడో అని ఆమెకు ఆశ్చర్యం కలిగింది. వేడి గానీ, చలిగానీ, శబ్దం గానీ, ప్రకాశం గానీ, క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంటే మనిషికి దానిని ఎదుర్కొనడానికి తట్టుకొనడానికి కూడా శక్తి కలుగుతుంది. వీటిలో ఏదైనా ఒకదాని ప్రచండత ఒకేసారి ఎదుర్కోవాల్సి వస్తే ఎంత గట్టివాడైనా నేలమట్టమై పోతాడు. తన తండ్రి గారి వికృత రూపం మెల్లమెల్లగా స్పష్టం కావడంతో, దానిని సహించే శక్తి కూడా ఆమెలో పెరుగుతూ వచ్చింది. దానితో పాటు హరి మీద ముందు కలిగిన అపార్థం మొత్తం తొలగిపోవడం వారి మధ్య ఉన్న అనురాగబంధం బలపడటం జరిగింది. ముందు ముందు జనకుడి పైన ద్వేషభావం పెంచుకోకుండా, పరోక్షంగా ఆయనకు ఎలా నచ్చ చెప్పడమనే ధర్మ సంకటంతో ఆమె కొంత కాలం గడిపింది. ఏమిటీ ఒక కూతురు తండ్రికి బుద్ధి చెప్పడమా ! ఆ విషయంలో తాండవ కృష్ణకి ఉగ్రకోపం వచ్చిందంటే దానిలో ఆశ్చర్య పడవలసినదేమీ లేదు. తన నిజ స్వరూపం అనూరాధకి దాదాపు అర్థమై పోయింది కదా అనే బాధ కూడా ఆ తండ్రికి కలిగింది. తన నిజ

స్వరూపం కొడుకుకి పూర్తిగా తెలిసి పోయినా తాండవ కృష్ణకి అందులో వైషమ్యం లేదు. ఎందుకంటే తండ్రి చేష్టితాలపై అతను అభిమానం చూపేవాడు, అది పూర్తిగా సమర్థించేవాడు. తన విషయాలు కొంతవరకూ తెలుసుకున్న కూతురి ముఖం వైపు చూడటానికి అతనికి సంకోచం కలిగింది. ఏదైనా సరే తనకు ప్రాణమైన కూతురిపై విరోధభావాన్ని పెట్టు కోవడమనేది అతనికి సాధ్యం కాలేదు. అనూరాధను తనకు వ్యతిరేకంగా పురిగొల్పే పని ఆ హరి కుమారే చేస్తున్నాడని ఆ బుద్ధి రాక్షసుడు తెలుసుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. దానితో ఆ యువకుడిని హత్య చేయాలన్నంత కోపం అతని హృదయంలో జ్వాలాముఖిలా ప్రజ్వరిల్లింది కానీ దానిని బయటికి వెల్లడించలేదు. తరువాత ఆ తండ్రీ కూతుళ్ళమధ్య సంబాషణ చాలా అవసరమైన విషయాలకు మాత్రమే పరిమితమయ్యింది. ఈ సంభవవికాసం గురించి కొద్ది కొద్దిగా తెలుసుకున్న మురళీ కృష్ణ ఉపదేశించడం, మందలించడం అప్పుడప్పుడూ తట్టడం కూడా జరిగింది. అనూరాధ విషయంలో మురళీ కృష్ణ జోక్యం కలగజేసుకోకూడదని తాండవ కృష్ణగట్టి హెచ్చరిక చేయడంతో ఆ అన్నాచెల్లెళ్ల మధ్య కూడా అంతరం చాలా పెరిగింది. ఆ విధంగా అనూరాధ ఆ ఇంటిలో ఒక ఖైదీగా మారింది. వేరెవరూ చూడకుండా కన్నీరు కార్చడం ఆమెకు అలవాటయింది. కూతురి దుఃఖనివారణ కోసం తన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం అతనికి సాధ్యం కాలేదు. అందుకే తన అసంతోషాన్ని కోపంగా రూపాంతరం చేసి, దానిని ఏ రోజైనా హరికుమార్ మీద ప్రయోగించదగిన ఒక ఆగ్నేయక్షిపణిగా తయారుచేసుకున్నాడు. హరికుమార్ అనూరాధకు అనురూపుడైన వరుడు అవుతాడని అనుకున్న తాండవకృష్ణతనపై తన కూతురు ఇంతకాలం చూపిస్తూ వచ్చిన ప్రేమాదరణలని ధ్వంసం చేసిన ఆ యువకుడ్ని ఏరోజైనా నాశనం చేయాలని దృఢంగా సంకల్పించాడు. కానీ హరికుమార్‌కు వ్యతిరేకంగా ఏ విధమైన దుశ్చర్య స్వీకరించినా, ఆ విషయం అనూరాధకు తెలవడంతో తమ మధ్య ఇప్పుడే ఏర్పడిన అగాథం మరి ఎప్పుడూ దగ్గర కానంత ఎక్కువగా పెరిగి పోతుందేమో అని ఆయనకు ఆశంక కలిగింది.

తన జూనియర్ మనుషులతో ఎక్కువగా మాట్లాడే తీరు కాదు తాండవకృష్ణది. హరికుమార్ ఒక ఆప్తమిత్రుడి కొడుకు కావడం వల్ల అతని పైన తాండవకృష్ణ తన ప్రచండ తాండవం ఎప్పుడూ కూడా ప్రదర్శించలేదు. నిర్దేశాలివ్వడానికి మాత్రమే అతను హరితో మాట్లాడేవాడు. హరి కూడా చాలా అవసరమైన విషయాలలో మాత్రమే అతనిని సంప్రదించేవాడు. వారి పరస్పర బంధం క్షీణించి వస్తూ ఉంటే వారి సంభాషణలు కూడా విరళమయ్యాయి. తమ ఆంతరంగిక భావాలను బహిర్గతం చేయడం వారిద్దరికీ ఇష్టం లేక పోయింది.

రెండేళ్ళ వరకూ అసహ్యించుకుంటూ సహప్రవర్తనం చేసిన తరువాత హరి సొంతంగా ప్రాక్టీసు పెట్టబోతున్నానని తన నిర్ణయం ప్రకటిస్తూ సీనియర్ వకీలుకు స్వస్తి చెప్పడమైంది. ఈ లోపల బి.యల్ పాసయిన అనూరాధ తన తండ్రి దగ్గర ప్రాక్టీసు చేయడం ఇష్టం లేదని చెప్పి పేరుమోసిన ఒక అభిభాషిక దగ్గర జూనియర్‌గా చేరింది.

ఈ కాలఘటంలో హరి అనూరాధలు కలిసి మాట్లాడుకునే సందర్భాలు అతి తక్కువ అయ్యాయి. న్యాయస్థానంలో కానీ లేక న్యాయవాదుల సమ్మేళనంలో కాని అపుడపుడూ కలవడం జరిగితే వారు మాట్లాడుకునే వారు. అయినా కూడా వారి మధ్య ఏర్పడిన ప్రేమ బంధం దృఢంగా గాఢంగా ఎప్పుడో పరిణమించింది. మొత్తం ప్రపంచం వ్యతిరేకించినా కూడా వారు దంపతులవ్వాలని నిర్ణయించుకున్నారు.

హరికుమార్ లీగల్ ప్రాక్టీసు దిన దిన ప్రవర్ధమానమవుతూ వచ్చింది. న్యాయ విరుద్ధమైన కేసులు అతను ఎప్పుడూ తీసుకునే వాడు కాదు. ఏదైనా కేసు తీసుకుని అతని దగ్గరకు వచ్చేవాళ్ళతో అతను చాలా మర్యాదగా వినయంగా మాట్లాడేవాడు. ఒక వేళ ఆ కేసు తీసుకోవడం అతనికి ఇష్టం లేనపుడు, దానిని తన అడ్వకేటు మిత్రులలో ఎవరికైనా అప్పచెప్పేవాడు.

న్యాయమూర్తుల న్యాయవాదుల మరియు న్యాయస్థానంలోని నిత్యసందర్శకుల మధ్య హరికుమార్ జనప్రీతిని .ఆర్జించ గలిగాడు.

సొంతప్రాక్టీస్ మొదలుపెట్టిన కొద్దికాలంలోనే హరికుమార్ ఉండటానికి ఒక చిన్న బంగళా, సంచరించడానికి అంత పాతది కాని ఒక కారు సంపాదించడం వల్ల, నల్గొండ జిల్లాలో ఒక మారుమూల గ్రామంలో ఉంటున్న తల్లితండ్రులను తన దగ్గరకు రప్పించుకున్నాడు. ఆ వృద్ధదంపతులకు స్వర్గం లభించినట్లయింది. తాండవకృష్ణ గురించి హరికుమార్ తన తండ్రితో ఎటువంటి దురభిప్రాయాన్ని ప్రకటించలేదు. ఎవరినీ ఆశ్రయించకుండా తన కాళ్ళమీద నిలబడి సొంత ప్రాక్టీసు ఎంత ముందుగా మొదలుపెడితే, అంత త్వరగా హైకోర్టు న్యాయమూర్తి దాకా పదోన్నతి పొందగలుగుతారని అతను తన తండ్రికి వివరించాడు. నాగభూషణం, తన మిత్రుడు తాండవకృష్ణని అపుడపుడూ సందర్శించేవాడు. తన కొడుకు సొంత ప్రాక్టీసు పెట్టే నిర్ణయం గురించి తాండవకృష్ణతో మొదటిసారి చెప్పేటపుడు "మీ అబ్బాయికి నాలాంటి ఒక మామూలు వకీలు కావాల్సిన దౌర్భాగ్యం ఎందుకురావాలి? అతను చాలా బుద్ధిమంతుడు, చాలా సమర్థుడు కొంతకాలం తరువాత అతను హైకోర్టు జడ్జి కాదు చీఫ్ జస్టిస్ అయినా దానిలో అతిశయం లేదు. అయినా కానీ అతని ముందు వెళ్ళి దణ్ణం పెట్టి నిల్చునే అవసరం వస్తుందని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే మహా అయితే నేను మరో నాలుగైదేళ్ళు మాత్రమే ప్రాక్టీసు కొనసాగిస్తాను. ఈలోగా దేవుడి నుంచి పిలుపు రాకపోతే ఇంకా కొంత కాలం కూడా బతుకుతానేమో!" అని తాండవకృష్ణ ఉదాసీనభావంతో అన్నాడు.

నాగభూషణం తెల్లబోయాడు. "ఏమిటి సార్ అలా అంటున్నారు? మా అబ్బాయి పెద్ద తప్పేమయినా చేశాడా? అతనికి ఇప్పటిదాకా పసితనం పోలేదు. తెలియక అతను ఏమైనా చేస్తే మీరే బుద్ధి చెప్పాల్సింది. దయచేసి అతనిపై ఒక దురభిప్రాయాన్ని పెట్టుకోవద్దు. అతనిని మీ సొంతబిడ్డగా చూడాలని నేను

ముందే చెప్పాను కదా?" అని విభ్రాంతితో అడిగేడు.

"నీవేం భయపడవద్దు అతనికి నీవుగానీ, నేనుగానీ బుద్ధి చెప్పేపని లేదు. వకీలు పనిలో నాకుకూడా దారి చూపించడానికి కావలసిన బుద్ధి సామర్థ్యాలు అతనికి ఉన్నాయి. ఈ మధ్యనే అతను ప్రాక్టీసు మొదలుపెట్టాడు. నువ్వు చూస్తూ ఉండు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గొప్ప న్యాయవాదులందరిలో అతనూ ఒకడవుతాడు. అప్పుడు నువ్వు నన్ను చూసీ చూడనట్లుగా మాత్రం వెళ్ళిపోవద్దు." అని అట్టహాసంగా నవ్వి తన మిత్రుడి భుజం మీద చేయివేస్తూ దగ్గరకు తీసుకొన్నాడు.

ఆ అట్టహాసం విన్న నాగభూషణానికి నవ్వు రాలేదు పైగా కొడుకు భవిష్యత్తును గూర్చి భయం పట్టుకొంది. తనకు మించిన పేరు ప్రఖ్యాతులు మరొకరికి రావటం సహించే మనస్తత్వం తనకు లేదన్న విషయం ఆ అభిభాషక రాక్షసునికి బాగా తెల్సు.

తనకుమారుని భద్రమైన భవిష్యత్తు కోసం ముక్కోటి దేవతలకు అతను మొక్కుకొన్నాడు.